# కాంగ్రెస్‌వి ఫ్యూడల్ పోకడలు

- ఆ పార్టీ సీనియర్లు పద్ధతి మార్చుకోవాలి
- టికెట్ల పంపిణీలో డబ్బుకే ప్రాధాన్యం
- బీజేపీ నేతలకు రాష్ట్రంపై సోయిలేదు
- కుల గణన ఎందుకు చేయడంలేదు..?
- సీఎం కేసీఆర్ సంక్షేమ పథకాలు భేష్
- సామాజిక వర్గాల సమస్యల పరిష్కారానికి కృషి
- 'నమస్తే తెలంగాణ' ఇంటర్వ్యూలో బీఆర్ఎస్ నేత చెరుకు సుధాకర్



ప్రత్యేక ఇంటర్వ్యూ

హైదరాబాద్, అక్టోబర్ 24 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ నాయకులు ఫ్యూడల్ పోకడలు పోతున్నారని, ఆ పార్టీ సీనియర్లు పద్ధతి మార్చుకోవాల్సిన అవసరం ఉన్నదని బీఆర్ఎస్ నేత చెరుకు సుధాకర్ పేర్కొన్నారు. బీజేపీ నాయకులకు రాష్ట్రంపై సోయే లేదని విమర్శించారు. ఇటీవల బీఆర్ఎస్‌లో చేరిన ఆయన 'నమస్తే తెలంగాణ'కు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. బీఆర్ఎస్ ద్వారా రాష్ట్రంలోని వివిధ సామాజిక వర్గాల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని చెప్పారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఏవిధంగా అభివృద్ధి చేసుకోవచ్చో సీఎం కేసీఆర్‌కు అన్ని విధాలుగా తెలుసునని అన్నారు. ఇంటర్వ్యూలోని ముఖ్యాంశాలు ఆయన మాటల్లోనే..

### కాంగ్రెస్ సీనియర్లు పద్ధతి మార్చుకోవాలి

ఎన్నికల్లో ప్రతిపక్షాలు వారి మధ్య ఉన్న వైరుధ్యాల కంటే అధికార పార్టీపైనే ఎక్కువగా ఫోకస్ చేస్తాయి. అందుకే సీఎం కేసీఆర్‌పై ఎక్కువగా దాడి చేస్తున్నారు. తెలంగాణకు, ప్రజలకు కనెక్టివిటీ ఉన్న వారే మంచి ఫలితాలు రాబట్టగలుగుతారు. తెలంగాణ ప్రజలకు ఏమి ఇవ్వగలుగుతాం అనే విషయాన్ని కేసీఆర్ చెప్తున్నారు. కొందరు కాంగ్రెస్ నాయకులు ఫ్యూడల్ ప్రభువులుగా మిగిలిపోతున్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు పద్ధతి మార్చుకుంటే మంచిది. ఈ మధ్య కాలంలో పాత పద్ధతికి భిన్నంగా టికెట్ల పంపిణీలో డబ్బే ప్రధానంగా చూస్తున్నారు.

### బీజేపీకి రాష్ట్రంపై సోయి లేదు

బీజేపీ రాష్ట్ర నేతలకు తెలంగాణ అస్తిత్వంపై సోయి లేదు. కేంద్రం రాష్ట్రానికి ఏమీ చేయకపోయినా ప్రధాని మోదీ గురించి ఆహో ఓహో అనడం వారికి అలవాటైంది. ఏ రాజకీయ పార్టీ అయినా తెలంగాణకు రావాల్సిన న్యాయమైన వాటా దక్కే విధంగా చూడాలి. కోట్లాడాలి. తెలంగాణ హక్కుల గురించి రాజీపడొద్దు. తెలంగాణ ప్రాజెక్టులకు రావాల్సిన నిధులు రాష్ట్రానికి రావడం లేదు. జీఎస్టీపై కేంద్రం లెక్కలు చెప్పాలి. రాబోయే నియోజకవర్గాల పునర్విభజనలో తెలంగాణకు, దక్షిణ భారతదేశానికి అన్యాయం జరిగే పరిస్థితి ఉన్నది. ఇది సరియైనది కాదు.

### కుల గణనపై బీజేపీ అభ్యంతరం ఎందుకు?

దేశవ్యాప్తంగా కులగణన చేయాల్సిన అవసరం ఉన్నది. సీఎం కేసీఆర్ అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపించారు. కాంగ్రెస్ కులగణన చేపట్టాలని చెప్పింది. కుల గణనపై బీజేపీ ప్రభుత్వానికి అభ్యంతరం ఏమిటో చెప్పాలి. దీనిపై తెలంగాణ బీజేపీ బీసీ నాయకులు ఎందుకు మాట్లాడటంలేదు? బీజేపీ బీసీ నాయకులు ఆ పార్టీని, ప్రభుత్వాన్ని ప్రశ్నించాలి.

### కేసీఆర్‌ను, బీఆర్ఎస్‌ను ఇరకాటంలో పెట్టలేదు

బీఆర్ఎస్ పార్టీని స్థాపించిన మొదటి నుంచీ రాష్ట్రం సిద్ధించే వరకు సుదీర్ఘకాలం పార్టీలో పనిచేశాను. అప్పుడున్న పరిస్థితులు, ఈగో, తప్పుడు అంచనాలతో బయటికి వెళ్లాల్సి వచ్చింది. అయినా నేను ఏనాడూ సీఎం కేసీఆర్‌ను కానీ, బీఆర్ఎస్‌ను కానీ ఇరకాటంలో పెట్టే పరిస్థితి తేలేదు. కేసీఆర్ మూడోసారి అధికారంలోకి వస్తారు. ఆయనపై ప్రజలకు విశ్వాసం ఉన్నది.

### అనుభవంతో సలహాలు

సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల ఫలితాలు బాగున్నాయి. మౌలిక సదుపాయాలపై కూడా దృష్టి పెట్టారు. రోడ్ల విస్తరణ, బ్రిడ్జిల నిర్మాణం మంచి ఫలితాలు ఇస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో విద్య, వైద్యం, మెడికల్ కాలేజీలపై డాక్టర్‌గా నాకున్న అనుభవంతో సలహాలు ఇస్తాను.

### అభివృద్ధిలో భాగస్వామ్యం అవుతా

రాష్ట్ర అభివృద్ధి, ప్రణాళికలో భాగస్వామ్యం పంచుకుంటా. క్షేత్రస్థాయిలో పనిచేస్తా. నల్లగొండ జిల్లాలో బీఆర్ఎస్ అభ్యర్థుల విజయానికి కృషి చేస్తా. కేసీఆర్ ఏ బాధ్యత అప్పగించినా ఆ పని చేస్తా.

# హైదరాబాద్‌కు ఫిదా

## నగర రూపురేఖలు మారిపోయాయి

- నాడు చూసిన నగరానికి నేటికీ ఎంతో తేడా ఉన్నది
- ఇంత భారీస్థాయిలో అభివృద్ధిని ఎక్కడా చూడలేదు
- ఇక్కడే ఉండిపోవాలనిపిస్తున్నది
- బీజేపీ ఎంపీ సన్నీడియోల్ ప్రశంసల వర్షం



హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 24(నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌ను చూస్తుంటే తనకు విదేశీ నగరాలు గుర్తొస్తున్నాయని బాలీవుడ్ ప్రముఖ నటుడు, గురుదాస్‌పూర్ బీజేపీ ఎంపీ సన్నీడియోల్ ప్రశంసించారు. ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొనేందుకు నగరానికి వచ్చిన ఆయన హైదరాబాద్ అభివృద్ధికి ఫిదా అయిపోయారు. షూటింగ్ కోసం, ప్రచార కార్యక్రమాల కోసం తాను గతంలో ఎన్నోసార్లు హైదరాబాద్ సందర్శించానని, అప్పటి హైదరాబాద్‌కు, ఇప్పటి హైదరాబాద్ ఎంతో తేడా ఉన్నదని పేర్కొన్నారు. 1990-2000 మధ్య చూసిన హైదరాబాద్‌కు, నేటి నగరానికి బోల్డంత వ్యత్యాసం ఉన్నదని కొనియాడారు. ఇక్కడి అభివృద్ధిని చూస్తుంటే ఇక్కడే స్థిరపడిపోవాలని అనిపిస్తున్నదంటూ మనసులో మాట బయటపెట్టారు. శరవేగంగా అభివృద్ధి చెందుతూ విశ్వనగరంగా ఖ్యాతినార్జించిన హైదరాబాద్‌పై ఇప్పటికే పలువురు సినీతారలు మనసు పారేసుకున్నారు. నగరాన్ని చూసి 'అయ్యో.. ఇక్కడ ఉండలేకపోతున్నామే' అని బాధపడుతున్నారు. విదేశాల్లో ఉండివచ్చిన వారు సైతం మారిన భాగ్యనగర రూపురేఖలు చూసి ముచ్చటపడుతున్నారు. విశాలమైన రోడ్లు, నిరంతర విద్యుత్ సరఫరా, అంతర్జాతీయ స్థాయి మౌలిక సదుపాయాలతో భూతల స్వర్గంగా మారిన నగరాన్ని చూసి మైమరచిపోతున్నారు. ఇప్పుడీ జాబితాలోకి సన్నీడియోల్ వచ్చి చేరారు.

### నేను ఇండియాలోనే ఉన్నానా?

హైదరాబాద్ అభివృద్ధిపై తమిళ తలైవా రజనీకాంత్ కూడా ప్రశంసల వర్షం కురిపించారు. తాను ఇండియాలోనే ఉన్నానా? అంటూ ఆశ్చర్యపోయారు. 22 ఏండ్ల తర్వాత ఇటీవల షూటింగ్ కోసం హైదరాబాద్ వచ్చినప్పుడు నైట్ టైం జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ వైపు వెళ్తే తానున్నది ఇండియాలోనా? న్యూయార్క్‌లోనా? అన్న అనుమానం కలిగిందని చెప్పుకొచ్చారు. తాను ఒకప్పుడు చూసిన హైదరాబాద్‌కు, ఇప్పటి హైదరాబాద్‌కు పొంతనేలేదని వివరించారు. టాలీవుడ్‌లో ఒకప్పుడు స్టార్ హీరోయిన్‌గా ఎదిగిన లయ కూడా హైదరాబాద్ నగరాభివృద్ధిని చూసి ఆశ్చర్యపోయారు. పెండ్లి తర్వాత అమెరికాలో స్థిరపడిన ఆమె ఇటీవల హైదరాబాద్ వచ్చారు. అత్యాధునిక హంగులతో, ఆకాశహర్మ్యాలతో, అడుగడుగునా కనిపిస్తున్న అభివృద్ధితో తొణికిసలాడుతున్న నగరాన్ని చూసి.. హైదరాబాద్‌లో ఉంటే లాస్‌ఏంజెలెస్‌లోనే ఉన్నట్టు ఉందని ప్రశంసించారు. బాలీవుడ్ ప్రముఖ నటి సోనాల్ చౌహాన్ కూడా హైదరాబాద్ అభివృద్ధిని చూసి ఇక్కడ పెట్టుబడులు పెట్టాలని అనిపిస్తోందని పేర్కొన్నారు. శంషాబాద్ విమానాశ్రయం నుంచి జూబ్లీహిల్స్ వస్తుంటే ఎత్తైన ఆకాశహర్మ్యాలు, విశాలమైన రోడ్లు, అభివృద్ధి చూసి ముచ్చటేసిందని, ఏదో విదేశాల్లో ఉన్న ఫీలింగ్ కలిగిందని చెప్పుకొచ్చారు. ఇంతగా అభివృద్ధి చెందిన నగరాన్ని తాను దేశంలోనే చూడలేదంటూ ప్రశంసల వర్షం కురిపించారు. అంతేకాదు, ఇక్కడ అభివృద్ధి చూస్తుంటే తనతోపాటు మరెంతోమంది బాలీవుడ్ నటీనటులకు ఇక్కడ పెట్టుబడులు పెట్టాలని అనిపిస్తోందని పేర్కొన్నారు. తమిళనాడులో స్థిరపడిన టాలీవుడ్ నటుడు శ్రీరాం సైతం తాను గతంలో చూసిన హైదరాబాద్ ఇది కాదని చెప్పారు. అతి తక్కువ కాలంలోనే నమ్మలేనంతగా హైదరాబాద్ అభివృద్ధి చెందిందని వివరించారు. ఇప్పుడీ జాబితాలోకి సన్నీడియోల్ వచ్చి చేరారు. వీరేకాదు, బ్రిటన్ ఎంపీ వీరేంద్రశర్మ, ఫాక్స్‌కాన్ చైర్మన్ యంగ్ లియు, ఆదిత్య ఠాకరే, ఛత్రపతి శివాజీ మునిమనవడు శంభాజీ రాజే, ఒడిశా సీఎం నవీన్ పట్నాయక్.. ఇలా చెప్పుకుంటూ పోతే ఎంతోమంది ప్రముఖులు హైదరాబాద్ నగరాభివృద్ధిని చూసి మైమరచిపోతున్నారు.

### కేసీఆర్ దార్శనికతకు గుర్తింపు

హైదరాబాద్‌పై ప్రముఖ ప్రశంసలు విపక్షాలకు చెంపపెట్టులా మారుతున్నాయి. నగరానికి వచ్చే సినీ, వ్యాపార, పారిశ్రామికవేత్తలు ఇక్కడ అభివృద్ధిని చూసి ముక్కున వేలేసుకుంటున్నారు. ఇంత అనతికాలంలో ఇంత అభివృద్ధా? అని ఆశ్చర్యపోతున్నారు. గడిచిన తొమ్మిదేండ్లలో చారిత్రక నేపథ్యం ఉన్న మహానగరంలో చోటుచేసుకున్న అభివృద్ధి, మెరుగైన మౌలిక వసతులు, అంతర్జాతీయస్థాయి నిర్మాణ శైలి, గ్లోబల్ కంపెనీల పెట్టుబడులు ప్రతి ఒక్కరిని ఆశ్చర్యంలో ముంచెత్తుతున్నాయి. ఒకప్పుడు చూసిన పాతనగరం, ఇప్పుడున్న మాడ్రన్ హైదరాబాద్‌ను చూసి తామున్నది గ్లోబల్ సిటీలోనేనని మురిసిపోతున్నారు. అంతర్జాతీయస్థాయి కంపెనీలు, పెట్టుబడులను ఆకర్షించాలంటే ఆ స్థాయికి తగిన మౌలిక వసతులు ఉన్నప్పుడే సాధ్యం అవుతుందని సీఎం కేసీఆర్ భావించారు. ఆ దిశగా దృష్టిసారించి విజయం సాధించారు. ఈ క్రమంలో గడిచిన తొమ్మిదేండ్లలో లెక్కలేనన్ని కంపెనీలు నగరంలో కాలుమోపాయి. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యాచరణతోనే రియలిస్టిక్ గ్రోత్ సాధ్యమవుతున్నదని నిపుణులు చెబుతున్నారు. తాజాగా హైదరాబాద్‌లో కొత్తగా ప్రారంభించిన పరిశ్రమ ప్రారంభోత్సవానికి హాజరైన బాబా టెక్స్‌టైల్ మెషినరీ బిజినెస్ హెడ్ కేశవ్ అగర్వాల్ తెలంగాణ పారిశ్రామికాభివృద్ధిని ప్రశంసించారు. రాష్ట్రంలో టెక్స్‌టైల్ మెషినరీ పరిశ్రమ వ్యాప్తికి ప్రభుత్వం అందిస్తున్న సహకారం అమోఘమని కొనియాడారు.

# నేర రాజధానిగా యూపీ

- 112.7 శాతం క్రైమ్ రేట్‌తో అగ్రస్థానం
- ఆ తర్వాతి స్థానాల్లో కేరళ, మహారాష్ట్ర
- తాజా నివేదికలో ఎన్సీఆర్బీ వెల్లడి

హైదరాబాద్, అక్టోబర్ 24 (నమస్తే తెలంగాణ): దేశానికి నేర రాజధానిగా ఉత్తరప్రదేశ్ 'ఘనకీర్తి' సాధించింది. దేశంలోనే అత్యధికంగా 112.7% క్రైమ్ రేట్‌తో అగ్రస్థానంలో కొనసాగుతున్నట్టు తాజా నివేదికలో నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్సీఆర్బీ) వెల్లడించింది. ఆ తర్వాతి స్థానాల్లో కేరళ, మహారాష్ట్ర, ఢిల్లీ, బీహార్ నిలిచినట్టు తెలిపింది. ఎన్సీఆర్బీ నివేదిక ప్రకారం.. ప్రతి లక్ష మంది జనాభా ఉన్న ప్రాంతంలో దాదాపు 446 నేరాలు జరుగుతున్నాయి. ఈ రేటు నిరుటి కంటే 0.5% తక్కువే అయినప్పటికీ నేరాలను అదుపు చేయడంలో పలు రాష్ట్రాలు విఫలమయ్యాయి. పట్టణీకరణ, జనాభా వేగంగా పెరగడం, ఉపాధి కొరవడటం, సామాజిక భద్రత లేకపోవడం, పోలీసులకు తగిన మౌలిక సదుపాయాలు కల్పించకపోవడం తదితర అంశాలు నేరాల పెరుగుదలకు ప్రధాన కారణమని తేల్చారు. తెలంగాణ, ఏపీ, కర్ణాటక, ఉత్తరాఖండ్, జార్ఖండ్ లాంటి రాష్ట్రాల్లో పోలీస్ వ్యవస్థను బలంగా తీర్చిదిద్దడం, వారికి సరైన శిక్షణ ఇప్పించడం, అవసరమైన సామగ్రి, మౌలిక సదుపాయాలు కల్పించడంతోపాటు చట్టాన్ని అమలు చేసే సంస్థల మధ్య నిరంతర సహకారం, సమన్వయం వల్ల నేరాలు అదుపులో ఉన్నట్టు పేర్కొన్నారు. ముఖ్యంగా నేర పరిశోధనకు ఆధునిక సాంకేతికతను విరివిగా ఉపయోగించుకోవడం, ఫోరెన్సిక్ సైన్స్‌ను మరింతగా సమర్థంగా వినియోగించుకోవడం ద్వారా ఎంతో క్లిష్టమైన కేసులను సైతం త్వరగా ఛేదిస్తున్నారని జాతీయ దర్యాప్తు సంస్థల అధికారులు చెప్తున్నారు.

**క్రైమ్ రేట్‌లో టాప్-10 రాష్ట్రాలు**

| రాష్ట్రం | శాతం |
|---|---|
| ఉత్తరప్రదేశ్ | 112.7 |
| కేరళ | 98.6 |
| మహారాష్ట్ర | 88.4 |
| ఢిల్లీ | 87.2 |
| బీహార్ | 86.9 |
| తమిళనాడు | 85.8 |
| మధ్యప్రదేశ్ | 84.5 |
| రాజస్థాన్ | 83.6 |
| అస్సాం | 82.4 |
| గుజరాత్ | 81.3 |

## దేవరగట్టులో బన్నీ ఉత్సవం



ఏపీలోని కర్నూలు జిల్లా దేవరగట్టులో బన్నీ ఉత్సవం ఘనంగా జరిగింది. దసరా పర్వదినాన గ్రామగుట్టపై అర్ధరాత్రి 12 గంటలకు మాళమ్మ, మల్లేశ్వరస్వామి కల్యాణం జరిపిస్తారు. ఉత్సవ విగ్రహాలను ఆలయ పరిసరాల్లో ఊరేగిస్తున్నారు. ఆ విగ్రహాలను దక్కించుకోవడం కోసం 3 గ్రామాల ప్రజలు ఒక వర్గంగా, మరో 5 గ్రామాల ప్రజలు మరో వర్గంగా ఏర్పడి కర్రలతో తలపడతారు. దీనిని బన్నీ ఉత్సవం అంటారు.


